# అందం

చక్రధర్రావు సాయంత్రం వీధిలోకి షికారు వెళ్ళేవేళ, జలజగంధి కాలేజీనించి తిరిగొచ్చేవేళ ఒకటే. జలజగంధి అందమైన పిల్ల. సౌందర్యరాశి. రత్యంశ సంభూతురాలు.

చక్రధర్రావు ఆమెను చాలా రోజులై చూస్తున్నాడు. ఆమె అందం అతన్నెంతగానో ఆకర్షించింది.

జలజగంధి ఒకనాడు కళాశాల నుంచి తిరిగి వస్తూండగా చక్రధర్రావు అన్నాడు:

'మీ. మొహం చాలా అందమైనది!'

జలజగంధి మాట్లాడకుండా వెళ్ళి పోయింది.

చక్రధర్రావు కూడా, ఆమె సమాధానం చెప్పనందుకు కించపడలేదు.

మరునాడే చక్రధర్రావు జలజగంధిని కలిశాడు.

'మీ మొహం చాలా అందమైనది. పైగా నాకు బాగా నచ్చింది!'. అన్నాడు.

జలజగంధి భరించలేక పోయింది. అయినా మాట్లాడక, ఓర్మివహించి తప్పించుకుని వెళ్ళిపోయింది. శాంతమే భూషణమని తెలుసు కాబోలు!

మూడో పర్యాయం చక్రధర్రావు మళ్ళీ కలసి 'మీ మొహం నన్నెంతగానో ఆకర్షించింది. అందుక్కారణం మీ అందం. సౌందర్యఖని మీరు! ఇల్లా అంటున్నందుకు అన్యథా తలంచని సహృదయత్వం మీలో ఉంటుందని నా విశ్వాసం' ఏకరువు పెట్టాడు.

జలజగంధి మండిపోయింది.

'ఏమిటి మీ ఉద్దేశం?' అంది.

'ఉద్దేశానికేముంది? మీ మొహం బాగా వుందని మీ ఎదుట అనడమే!'

'నా అందంతో మీకేం పని?'

'ఆఘ్రాణించడమే!... ఒక గులాబి పువ్వుంది. అది అందంగా వుందని చెప్పుకునే హక్కు ప్రతి ఒక్కరికీ వుంది. దీన్నెవరూ కాదనలేరు. ఈ సందర్భంలో మీ మొహం ఒక గులాబీ పువ్వు!' అన్నాడు.

చక్రధర్రావు చెప్పిన దృష్టాంతం, జలజగంధికి నూటికి నూరుపాళ్ళూ సత్యమే అనిపించింది. వెంటనే ఆ ప్రదేశం నుంచి నిష్క్రమించింది.

❁ ❁ ❁

నళినీధరం చక్రధరంతో అన్నాడు:

'నిన్ను ఏమాత్రం నమ్మరాదనిపిస్తుంది. నువ్వు మాయల మారివి. కారణం ఏమంటావా? అలా వొచ్చిందంతే! ఆదికవికి మల్లే వర్ణనలు చేస్తావు.'

చక్రధర్రావు చలించలేదు. ఊఁ అని బలంగా ఊపిరి తీసాడు.

'ఔను. వివేకహీనుల దృష్టిలో చక్రధరం మాయలమారి!' అన్నాడు.

'ఇందులో వివేకహీను లెవరో నీకే తెలుస్తుంది. ఈ సంగతి విను...'

'వినడానికి అభ్యంతరం లేదు. కాని నువ్వు చెప్పేది, వినకుండానే వివేకశూన్యం నీలోనే ఉందని నాకు తెలుసు.' అన్నాడు.

నళినీధరం చెప్పాడు.

'నువ్వావేళ జలజగంధితో జరిపిన సంభాషణలు అందరికీ నచ్చేయి. నాకూను, నేనామెను కలిశాను. 'మీ మొహం అందమైనది!' అన్నాను. ఆమె మాట్లాడలేదు.

'మరోనాడు కలిశాను. అల్లాగే అన్నాను. ఆమె మౌనం వహించింది. నాకు ఉద్రేకం కలిగింది. సమాధానం చెప్పదేమీ?

'మీ ముఖం చంద్రసమం. మాట్లాడరేం? అని అడ్డుపడ్డాను...'

'ఆమె వెంటనే చెయ్యి చేసుకుంది! అంతేనా?' చక్రధరం బ్రేకువేశాడు. 'అదే నువ్వు చేసిన వెర్రి వెధవపని! అడ్డు పడేందుకు నీకు హక్కుందా?'

'మరి నువ్వే చెప్పావుగా, గులాబి పువ్వు అందంగా వుందనిచెప్పుకునే

అధికారం ప్రతి ఒక్కరికీ ఉన్నదని. ఆఘ్రాణించడంలో కూడా తప్పులేదనీను...?'

'అదే పొరపాటు. ఆఘ్రాణించడం దూరం నుంచే కాని త్రుంచడానికి యత్నం చేయరాదు. గులాబి పువ్వే త్రుంచ యత్నిస్తే, దానికి వాడి ఐన ముల్లు వున్నది కదూ?'

నళీనధరం మొహం ఇంత చేసుకున్నాడు. కొంచెం సిగ్గుతో ముఖానికి చేతిరుమాలు అడ్డం వేశాడు

● జ్యోతి మాసపత్రిక ●
*డిశంబరు 1955*